క్లుప్తంగా

ఈ–పంట నమోదు పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్, ఏవో

కొయ్యలగూడెం : మండలంలో ఈ–పంట నమోదుపై రైతులకున్న పరిజ్ఞానం గురించి తహసీల్దార్ కె.చెల్లన్నదొర అడిగి తెలుసుకున్నారు. బుధవారం ఆయన ఏవో చెన్నకేశవులతో కలిసి రాజవరం, యర్రంపేట, పొంగుటూరు, గవరవరం గ్రామాల్లో పర్యటించారు. ఉద్యాన అధికారి ధీరజ్ లక్ష్మణ్‌తో కలిసి రైతులు తప్పనిసరిగా ఈ–పంట నమోదు చేసుకోవాలని తెలియజేశారు. అలాగే ఈ ఖరీఫ్‌కి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న పరికరాలు తనిఖీ చేసి, రైతులకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉండాలని ఆదేశించారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



కొయ్యలగూడెం మండలం సరిపల్లి గ్రామంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన నిర్వహించిన దృశ్యం.

కొయ్యలగూడెం: సరిపల్లిలోని సీతా రామచంద్ర లక్ష్మణ సమేత హనుమద్ ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో ఉదయం 8:11 గంటలకు అర్చకులు గణపతి శర్మ, ప్రధాన పురోహితుల వేదమంత్రోచ్చారణ నడుమ ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. మధ్యాహ్నం నుంచి మహా అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.

ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు



స్టాక్ అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్

కుక్కునూరు: ఇసుక అక్రమ రవాణా చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని కుక్కునూరు తహసీల్దార్ పెద్దిరాజు పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గత రెండు రోజుల క్రితం అశ్వారావుపేటలో ఇసుక అన్‌లోడ్ చేసిన లారీలపై కేసు నమోదు చేశామన్నారు. ప్రభుత్వం అందించే ఉచిత ఇసుక పంపిణీని ప్రజలు సక్రమంగా వినియోగించుకోవాలని ఆయన అన్నారు.

ఇన్‌స్పెక్షన్ టీం ఆకస్మిక తనిఖీ



వసతి గృహ భవనాన్ని పరిశీలిస్తున్న టీం సభ్యులు

కొయ్యలగూడెం: వసతి గృహాల నిర్వాహకులు చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్ జువైనల్ జస్టిస్ యాక్ట్ నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలని డిస్ట్రిక్ లెవెల్ ఇన్‌స్పెక్షన్ టీం పేర్కొంది. బుధవారం కొయ్యలగూడెం పొంగుటూరు గ్రామాలలో టీం సభ్యులు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా లివింగ్ శాక్రిఫైజ్ మినిస్ట్రీస్, కెనన్య చిల్డ్రన్ హోమ్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహాలను అధికారులు పరిశీలించి, నిర్వాహకుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. నోడల్ ఆఫీసర్ జె.దుర్గాప్రసాద్, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి డాక్టర్ సీహెచ్ సూర్య చక్రవేణి, ఐసీడీఎస్ పీవో యూఎన్ స్వర్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

కేజీ గంజాయి స్వాధీనం.. నలుగురి అరెస్టు

చింతలపూడి: మండల పరిధిలోని రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో బుధవారం పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో నలుగురు యువకులను అదుపులోకి తీసుకుని వారి నుంచి కేజీ గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఎం.రవీంద్ర నాయక్ బుధవారం చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మేడిశెట్టివారి పాలెం దేవుడి చెట్టు వద్ద ఎస్సై కుటుంబరావు సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేస్తున్నారు. తెలంగాణ వైపు నుంచి ఐదుగురు యువకులు రెండు ద్విచక్ర వాహనాల్లో అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో తనిఖీలు జరిపారు. ఖమ్మం జిల్లా వేంసూరుకు చెందిన షేక్ ఆరీఫ్, సత్తుపల్లికి చెందిన కాలం అజయ్, షేక్ ఇబ్రహీం, చింతలపూడి మండలం చింతంపల్లికి చెందిన పసుపులేటి మనోజ్, సత్తుపల్లి మండలం గంగారం గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్ కరీంలను అదుపులోకి తీసుకుని వారి నుంచి 1,050 గ్రాముల గంజాయి, 2 బైక్‌లు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చెప్పారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.



గ్రామీణ వైద్యులకు రక్షణ అవసరం



గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న వైద్యులకు, సిబ్బందికి రక్షణ కల్పించాలి. ప్రతీ ఆసుపత్రిలో సీసీ కెమేరాలు ఏర్పాటు చేసి, సెక్యూరిటీ గార్డులను నియమించాలి. కోల్‌కత్తాలో మహిళా వైద్య విద్యార్థినిపై దాడి చేసిన దోషులను కఠినంగా శిక్షించాలి. అటువంటి సంఘటనలు జరగకుండా జాతీయ స్థాయిలో కట్టుదిట్టమైన చట్టాలను రూపొందించాలి.

– కె.శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్, చింతలపూడి మండలం

కఠిన శిక్షలు విధించాలి



మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న వారికి వేసే శిక్షలు కఠినంగా ఉండాలి. మరొకరు ఆ తప్పు చేయాలంటే భయపడేలా విధంగా శిక్ష అమలు చేయాలి. న్యాయస్థానాలు కూడా ఇలాంటి కేసుల్లో కాలయాపన చేయకుండా వీలైనంత త్వరగా శిక్షలను అమలు చేయాలి. అందుకు అవసరమైన చట్టాలను తీసుకురావాలి. అప్పుడే మహిళలకు ధైర్యం ఏర్పడుతుంది.

– నెరుసు సాయిశ్రీవల్లి, మహిళా వైద్యురాలు

వరద సాయమేదీ..?

- 40 రోజులుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న వైనం
- డిప్యూటీ తహసీల్దార్‌ను నిలదీసిన బాధితులు

వేలేరుపాడు: గోదావరి వరద వలన ఇళ్లు నీటమునిగినా వరద బాధితులకు రూ.3 వేలు ప్రభుత్వం తక్షణ సాయం నేటికీ అందకపోవడంతో వరద బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత నెల 19న గోదావరి వరద రావడంతో వేలేరుపాడు మండలంలో అనేక గ్రామాలు నీటమునిగాయి. వరద నుంచి తేరుకొని ఇప్పటికి 40 రోజులు దాటుతోంది. బాధితులు తమ సొంత ఇళ్లకు చేరుకున్నారు. కానీ తక్షణ సాయం రూ.3 వేలు అందించడంలో అధికారులు అదిగో, ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప పరిహారం అందించడం లేదు. తమకు పరిహారం అందించాలని 40 రోజులుగా బాధితులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం కన్పించడం లేదు. గోదావరి వరద వస్తే ముందుగా నీట మునిగేది వేలేరుపాడు మండల కేంద్రంలో సంతబజారు. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక వెలువడగానే ఇక్కడ ఎనిమిది ఇళ్లు, మూడో ప్రమాద హెచ్చరికకు సుమారు 95 ఇళ్లు వరద నీటిలో మునుగుతాయి. ఇలా గత నెలలో 150 కుటుంబాల వారు ఇళ్లు ఖాళీ చేసి, కొంతమంది సురక్షిత ప్రాంతానికి తరలి వెళ్లగా, మరి కొందరు శివకాశీపురంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో తలదాచుకున్నారు. అయితే వీరిలో శివకాశీపురం పునరావాస కేంద్రంలోని 63 కుటుంబాలకు వీఆర్వో తక్షణ సాయంగా రూ.3 వేలు అందించారు. మిగతా 87 కుటుంబాల వారికి నేటికీ వరద సాయం అందించలేదు. అయితే మండలంలో ఇళ్లు నీట మునగకపోయినా, జల దిగ్బంధంలో ఉన్న గ్రామాలకు రూ.3 వేలు తక్షణ సాయం అందించిన అధికారులు నిజంగా నీట మునిగిన బాధితులకు మాత్రం మొండి చెయ్యి చూపించడం విమర్శలకు దారితీస్తోంది.

డిప్యూటీ తహసీల్దార్‌ను నిలదీసిన బాధితులు

వేలేరుపాడు తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌ను బాధితులు నిలదీశారు. తమకు ఎందుకు తక్షణ సాయం అందించలేదంటూ ప్రశ్నించారు. తమను ఇంకా ఎంత కాలం కార్యాలయం చుట్టూ తిప్పుకుంటారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన డిప్యూటీ తహసీల్దార్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని, సమస్య రెండు రోజుల్లో పరిష్కారమవుతుందని తెలిపారు. దీంతో బాధితులు శాంతించారు.



రూ.3 వేలు తక్షణ సాయం కోసం డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌ను నిలదీస్తున్న వరద బాధితులు

నాకు ఏ సాయం అందలేదు



గోదావరి వరద వలన నా ఇల్లు నీట మునిగింది. ఖాళీ చేసి, కుటుంబంతో పది రోజులు సురక్షిత ప్రాంతానికి తరలి వెళ్లాం. మా కుటుంబానికి ప్రభుత్వ సాయం నేటికీ అందలేదు.

– బీరం పద్మావతి, సంతబజారు వేలేరుపాడు

అంధురాలినైనా కనుకరించలేదు



నేను అంధురాలిని నా ఇల్లు గోదావరి వరదలో నీట మునిగింది. తక్షణ సాయం రూ.3 వేలు నేటికీ ఇవ్వలేదు. కనీసం బియ్యం కూడా అందించలేదు. నేను అంధురాలినని కనికరం కూడా లేకుండా ప్రతి రోజూ కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు.

– తుర్రం భద్రమ్మ వేలేరుపాడు

కాళ్లరిగేలా తిరిగినా ఫలితం లేదు



గత నెల 22న నా ఇల్లు వరద నీటిలో మునిగింది. కుటుంబంతో సహా సురక్షిత ప్రాంతానికి వెళ్లాను. నేటికీ ప్రభుత్వ సాయం అందలేదు. రూ.3వేలు తక్షణ సాయం కోసం నెల రోజులుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం దక్కలేదు.

– బడిగంటి సత్యనారాయణ

ధైర్యంగా నిలబడదాం



వైఎస్సార్‌సీపీ శ్రేణులతో మాట్లాడుతున్న జెట్టి గురునాథరావు

కొయ్యలగూడెం: కూటమి శ్రేణుల నుంచి మనల్ని మనం కాపాడుకోవడంలో ధైర్యంగా నిలబడదామని పోలవరం, చింతలపూడి నియోజకవర్గాల వైఎస్సార్‌సీపీ నాయకులు జెట్టి గురునాథరావు పేర్కొన్నారు. బుధవారం గంగవరంలో వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్ కంచర్ల సత్యనారాయణ నివాసం వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొయ్యలగూడెం మండలంలో ఇటీవల కూటమి పార్టీల శ్రేణులు దాడులకు పాల్పడడంతో గాయాల పాలైన వారి వివరాలను వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు జెట్టికి వివరించారు. సూపర్ సిక్స్ పథకాల హామీల అమలను వదిలి పెడదోవ పట్టే విధంగా కూటమి శ్రేణులు వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు పూనుకోవటం సిగ్గుచేటన్నారు. ప్రతీ కార్యకర్తకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని పార్టీ అండగా నిలబడుతుందన్నారు. మాజీ సర్పంచ్ పాముల నాగ మునిస్వామి, ఎంపీటీసీ చింతయ్య, చీర్ల శ్రీనివాసరావు, బల్లె నాగేశ్వరరావు, తమ్మిర్చి బ్రహ్మన్న, కోనా గంగరాజు, ఎస్‌కే విశ్వనాథ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి



జోహార్లు అర్పిస్తున్న సీపీఐ, ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు

జంగారెడ్డిగూడెం: పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీపీఐ.ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యుడు కేవీ రమణ డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెం ధర్మన్న స్మారక భవనంలో బుధవారం విద్యుత్ ఉద్యమ అమర వీరుల 24వ వర్ధంతి సందర్భంగా వారికి జోహార్లు అర్పిస్తూ నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేవీ రమణ మాట్లాడుతూ 2000 సంవత్సరంలో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా వామపక్ష విప్లవ పార్టీల ఆధ్వర్యంలో పోరాటం చేశామన్నారు. ఈ పోరాటంలో పోలీసులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డి అమరులయ్యారని తెలిపారు. కార్యక్రమంలో మల్లేటి శ్రీను, కె.రామలక్ష్మి, ఎం.వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పాత రికార్డుల పరిశీలన



కార్యాలయంలో భద్రపరచిన రికార్డులు

వేలేరుపాడు: తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలోని పోలవరం అడ్మినిస్ట్రేషన్ ప్రధాన కార్యాలయంలో ఇటీవల కొంతమంది ముఖ్యమైన రికార్డులు దహనం చేసిన నేపథ్యంలో వేలేరుపాడు తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు అప్రమత్తమయ్యారు. 2022వ సంవత్సరంలో వచ్చిన గోదావరి వరదలో మండలంలో 21 రెవెన్యూ గ్రామాల రికార్డులు మునిగాయి. కొన్ని రికార్డులకు చెదలు కూడా పట్టాయి. అప్పట్లో వాటిని ఆరబెట్టి, రికార్డు రూమ్‌లో భద్రపరచారు. అయితే బుధవారం కార్యాలయంలోని రికార్డు రూమ్‌లో ఉన్న పట్టా భూములు, ఎసైన్‌మెంట్ భూములు, కాస్రా పాత పహాణీ, పసలీ, ఎన్నికల, ఇతర రికార్డులు బయటికి తీసి, జాయింట్ కలెక్టర్‌కు నివేదిక పంపారు.

ఇంటింటి సర్వేపై అవగాహన



బీఎల్‌వోలకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

వేలేరుపాడు : ఇంటింటి సర్వే ద్వారా కొత్త ఓటు, ఓటరు కార్డ్ నందు పేరు, అడ్రెస్ మార్పులకు, ఇతర సవరణలకు దరఖాస్తులను తీసుకోవాలని బూత్ స్థాయి అధికారులకు వేలేరుపాడు తహసీల్దార్ సత్యనారాయణ సూచించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఇటీవల కలెక్టర్ వెట్రిసెల్వి తహసీల్దార్లకు, బూత్‌స్థాయి అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్పెషల్ సమ్మరీ రివిజన్–2025 పై సూచనలను ఇచ్చారన్నారు. దీనిలో భాగంగా ఆగస్టు 21 నుంచి సెప్టెంబర్ 21 వరకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారు తమ రేషన్ కార్డ్, ఆధార్ కార్డ్, వయసు ధృవీకరణ పత్రాలతో ఓటు హక్కుకు దరఖాస్తులను బీఎల్‌వోలకు గాని, ఆన్ లైన్ ద్వారా గాని సమర్పించాలని తహసీల్దార్ కోరారు. తుది ఓటర్ల జాబితా జనవరి 06, 2025న ప్రచురిస్తారని తెలిపారు.

ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ

జంగారెడ్డిగూడెం: ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ 2025 తయారీకి పోలింగ్ బూత్‌స్థాయి అధికారులతో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు జంగారెడ్డిగూడెం ఆర్డీవో కె.అద్దయ్య తెలిపారు. బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డివిజన్ పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఓటు హక్కు పొందాలని సూచించారు.

మండపాల ఏర్పాటులో నిబంధనలు పాటించాలి

చింతలపూడి: వినాయక మండపాలు ఏర్పాటు చేసుకునే ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీస్ నిబంధనలు పాటించాలని జంగారెడ్డిగూడెం డీఎస్పీ పి.రవిచంద్ర విజ్ఞప్తి చేశారు. చింతలపూడి సర్కిల్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ రవిచంద్ర మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలోని చింతలపూడి, తడికలపూడి, ధర్మాజీ గూడెం జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్ల పరిధిలో వినాయక చవితి సందర్భంగా మండపాలు పెట్టే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు వారి అనుమతి తీసుకోవాలన్నారు. వినాయక మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో చింతలపూడి సీఐ రవీంద్ర నాయక్ పాల్గొన్నారు.

విషజ్వరాలతో ప్రజల బెంబేలు

- ఊరంతా బాధితులే
- ఒళ్లు నొప్పులు, కాళ్లవాపులు, మొఖంపై మచ్చలు
- కర్రలు చేతబట్టి నడుస్తున్న గిరిజనులు

వేలేరుపాడు: ఏజెన్సీ వాసులు విష జ్వరాలతో బెంబేలెత్తిపోతున్నారు. మండలంలోని జిన్నెలగూడెం గ్రామాన్ని విష జ్వరాల బారిన పడ్డారు. గ్రామంలోని వారంతా బాధపడుతున్నారు. కాళ్లు, ముఖం వాపులు, నల్లని మచ్చలు, ఒళ్లు నొప్పులతో నడవలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ గ్రామంలో మొత్తం 80 గిరిజన కుటుంబాలున్నాయి. వీరిలో సుమారు 45 కుటుంబాల వారు జ్వరంతో మంచాన పడ్డారు. పది రోజుల క్రితం ఈ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఆ తరువాత వైద్యశాఖ నేటికీ ఈ గ్రామం వైపు కన్నెత్తి చూడలేదు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న ఇద్దరు వైద్యాధికారులకు ఓపీలో వందలాది జ్వర పీడిత కేసులు చూడటానికే సమయం సరిపోతుంది. గిరిజన గ్రామాలకు వెళ్లే సమయం దొరకడం లేదు. దీంతో అనేక మంది గిరిజనులు ప్రభుత్వ వైద్యం అందక ప్రైవేట్ వైద్యులను ఆశ్రయిస్తున్నారు. గ్రామంలో జ్వరాల వ్యాప్తికి దోమలు కారణంగా చెప్పవచ్చు. గ్రామంలో దోమల బెడద అధికంగా ఉంది. నేటికీ ఒక్కసారి కూడా దోమల మందు పిచికారీ చేసిన పాపాన పోలేదు. వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిన స్థానిక అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

కదల లేని స్థితిలో గిరిజనులు

యువతీ, యువకులు వృద్ధులు వయస్సుతో సంబంధం లేకుండా జ్వరం వచ్చాక చతికిలపడుతున్నారు. కొంత మంది జ్వరం వచ్చి పది రోజులు దాటాక కూడా నడవలేక కర్రలు చేతబట్టి నడుస్తున్నారు.

పెరుగుతున్న జ్వరపీడితులు

పోలవరం రూరల్: వాతావరణంలో వచ్చిన మార్పులతో జ్వరపీడితుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. ఇటీవల కురిసిన వర్షాలతో పాటు, ఎండ తీవ్రత, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు ఊపిరి పీల్చుకునే లోపే జ్వరాలు వెంటాడుతున్నాయి. పోలవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో జ్వరాలతో బాధపడుతూ చికిత్స కోసం వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోంది. ప్రతీ రోజు 130 నుంచి 150 మంది వివిధ వ్యాధులతో బాధపడుతూ వైద్య సేవల కోసం చికిత్స కోసం వస్తుంటే వారిలో సుమారు 60 నుంచి 70 మంది వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. వైద్యశాల వద్ద రక్త పరీక్షలు, మందులు తీసుకునేందుకు రోగులు క్యూ కట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. జ్వరం వస్తే వెంటనే వైద్యశాలకు వచ్చి రక్త పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలని వైద్యులు సూచిస్తున్నారు.



జిన్నెలగూడెం గ్రామంలోని జ్వర పీడితులు



పోలవరం సామాజిక ఆరోగ్య కేంద్రానికి వైద్యం కోసం వచ్చిన రోగులు

వారం రోజులుగా తగ్గని జ్వరం



ఫొటోలో కన్పిస్తున్న ఈమె పేరు చిన్నమ్మి. వారం రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. ప్రైవేట్ వైద్యుడి వద్ద చికిత్స చేయించుకుంటోంది. అయినా జ్వరం తగ్గడం లేదు. ప్రస్తుతం కీళ్లు, ఒంటి నొప్పులతో నడవలేక నానా ఇబ్బందులు పడుతోంది.

– చిన్నమ్మి, జిన్నెలగూడెం

అన్న ప్రసాద వితరణ

జంగారెడ్డిగూడెం: స్థానిక అశ్వరావుపేట రోడ్డు హైస్కూల్ వద్ద వేంచేసియున్న శ్రీ వరసిద్ధి నాయక స్వామి సన్నిధిలో బుధవారం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ అన్న ప్రసాద వితరణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో కొమ్మసాని రవీందర్ రెడ్డి, కల్లూరి మురళీకృష్ణ, చల్లా వరప్రసాద్, శీధరాల శ్రీనివాస వెంకట గంగాధర్, చెన్నూరు శివాజీ కృష్ణ, గన్నమని శీను, భక్తాంజనేయ స్వీట్ షాప్ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్యాణోత్సవాలు

జంగారెడ్డిగూడెం: శివ కేశవులు ఇద్దరికీ బేధం లేదని భక్తులందరికీ తెలియజేయాలనే తలంపుతో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఏక కాలంలో శివుడు, కృష్ణుడు కల్యాణాలు నిర్వహిస్తున్నామని విశ్వ హిందూ పరిషత్ సభ్యులు కేవీఆర్ సత్యనారాయణ తెలిపారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని అశ్వరావుపేట రోడ్డులో బాలుర ఉన్నత పాఠశాల ప్రక్కనగల శ్రీ సర్వ మంగళ సహిత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం నందు 29న సాయంత్రం 7 గంటలకు ఈ కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

అధిక దిగుబడులే లక్ష్యంగా పొలంబడి



పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: అధిక దిగుబడులే లక్ష్యంగా పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్నామని మండల వ్యవసాయ శాఖాధికారి కె.రాంబాబు తెలిపారు. బుధవారం పోలవరంలో పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలంబడి కార్యక్రమంలో 25 ఎకరాలు గాను 30 మంది రైతులను ఎంచుకున్నామన్నారు. ప్రతి బుధవారం క్షేత్ర స్థాయిలో 14 వారాలు ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన పంట పండించుట, ఎరువులు వాడకం తగ్గించుట, రైతుకు నికర ఆదాయం పెంపొందించుట ముఖ్య సూత్రాలుగా పని చేయడం పొలంబడి ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. కార్యక్రమంలో రైతులు, ఏవో కె.రాంబాబు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు సిద్ధం చేసుకోవాలి

పోలవరం రూరల్: త్వరలో నిర్వహించబోయే రెవెన్యూ సదస్సులకు సంబంధించి వీఆర్‌వోలు రికార్డులు సిద్ధం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి దేవకీదేవి ఆదేశించారు. పోలవరం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ బీఎస్‌వీఎస్‌ఆర్‌ఎల్ రాజుతో కలిసి వీఆర్‌వోలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎన్.ప్రసాద్, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

పోలవరం రూరల్: మండలంలోని కొత్త పట్టిసీమ గ్రామ పంచాయతీ పరిధిలో దోమల నివారణకు ఫాగింగ్ కార్యక్రమం చేపట్టారు. బుధవారం రాత్రి గ్రామంలో పలు వీధుల్లో సర్పంచ్ మైగాపుల విజయదుర్గ, కార్యదర్శి ఎ.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది వీధుల్లో ఫాగింగ్ నిర్వహించారు.

ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ రాజేష్

కామవరపుకోట: రోడ్డు ప్రమాదాల నివారణకు ఆటో డ్రైవర్లు కృషి చేయాలని జంగారెడ్డిగూడెం సీఐ పి.రాజేష్ అన్నారు. బుధవారం కామవరపుకోట చెక్‌పోస్ట్ సెంటర్‌లో ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని, ఇన్సూరెన్స్, రోడ్ టాక్స్ చెల్లించాలని, తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. తడికలపూడి ఎస్సై పి.చెన్నారావు ఆయన వెంట ఉన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు బుధవారం రూ.1,01,116 విరాళంగా అందజేశారు. విజయవాడకు చెందిన నేరెళ్ల వెంకట రఘునాథ్ ముందుగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈవో మెట్టపల్లి దుర్గారావు, సూపరింటెండెంట్ రమణరాజులు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.